

# గొప్పవాడి తిరుగుబాటు

రాం ప్రసాద్

బస్సు కోళ్ళ గంపలాగుంది.

జనం కోళ్ళలాగ అరుస్తున్నారు. రేపు కోళ్ళలా గుడ్లు పెడతారు.

తినడం—కనడం; తినడం—కనడం.

ఒక్కడికీ యాంబిషన్ లేదు.

నాకో? నాకున్నది బోలెడంతుంది.

నాకు యాంబిషన్ వున్నది. బస్సుకు యింజనుంది.

బస్సుకు సీట్లూ చక్రాలూ; నాకు కాళ్ళూ చేతులూ.

పాడుబస్సు. ఎంతకీ కదలి చావదే.

ఈ పాడు బస్సు కడుపులో నేను.

బస్సు కదిలితేనే నేను కదులుతాను. లేకపోతే లేదు. నాచుట్టూవున్నవాళ్లు కదిలితేనే నేను కదులుతాను లేకపోతే లేదు.

ఉహుఁ! వాళ్ళు కదలరు. వాళ్ళకు చదువు లేదు. సంధ్యలేదు.

స్పిరిట్ లేదు. కళాకాంతీలేవు. వాళ్ళంతా కప్పలు. వాళ్ళంతా బొద్దింకలు. కదలనే కదలరు. ఎప్పటికీ కదలరు.

ప్రక్కన కాలువలో పందిపిల్ల కదిలింది మురికి కంపునులేపి.

ఛీ! ఈ పాడు బస్సు ఎంతకూ కదిలి చావదేం?

ఉక్కపోత. చెమట వాసన. కుళ్ళువాసన

కుసుమ పరాగాలు.

లేవు. పారిజాత సుమసౌరభాలు లేవు

ధనలక్ష్మి కంకణ నిక్వాణ సంజనిత శింజినీ రవముల్ లేవు

జేబులో చిల్లర డబ్బులు మాత్రమే కలవు.

ఏవి తండ్రీ నిరుడు కురిసిన హిమ సమూహములు.

"హిమ సమూహములు" లేవు లేవు. లేనేలేవు.

వాట్ 69 లేదు.

ఒడిలో వగలాడి లేదు.

నక్షత్ర వీధీ దీప్త కాంతిచ్ఛటల్ లేవు

కునికే వీధి దీపాలు మాత్రమే కలవు.

హార్యక్షాట్టహాసాల్ లేవు.

నాలాంటి గొప్పవాళ్ళకు కూడా లేపు లేవని మూలుగులు మాత్రమే కలవు.

నాకు మేధ కలదు.

కానీ నా ఐశ్వర్యాలు కరిగిపోయాయి.

నాకు మనసు కలదు.

అనుభవాలు అందని ద్రాక్షపళ్ళలా వూరిస్తున్నాయి.

వంద ప్రశ్నలు. మెదడులో వంద పిల్లేలు విసురుతుంది. సైన్సొద్దు.

మతం కావాలి. ఏపని చేసినా, ఆత్మ సమర్థన యిస్తుంది.

కళవద్దు. ఫాంటసీ కావాలి.

నాకీ పాడుపని, పాకీపని డాక్టరుపని వద్దు.

నాకు ప్రపంచాధిపత్యం, లేకపోతే దేశాధిపత్యం, కనీసం కలెక్టర్, డి. యస్. పి. పనైనా కావాలి.

మనసుగల మేధ. మేధగల మనస్సు వద్దనే వద్దు.

పులి పంజా కావాలి. గాండ్రుమనే పులి. నవ్వే సింహం.

లయన్స్ క్లబ్ మెంబర్‌షిప్.

నాకీపాడు మనుషులు — కంపు బ్రతుకు వద్దు.

యుద్ధం కావాలి.

హింసనచణ, ధ్వంసనచణ. తిరుగులేని అధికారం.

ఈ ఒంటరితనం భరించలేను.

ఈ డొల్ల బ్రతుకు బరువు దించలేను.

బ్రతకలేను. చావలేను.

తలనొప్పి.

డాక్టర్ ఉమేష్‌కి తలనొప్పి

రావు బహదర్ సంగమేశ్వరరావు మునిమనుమడికి తలనొప్పి

ఎంత దారుణం

ఆకాశం కూలిపోలేదే

కనీసం ఈ బస్సైనా కదలదే.

అదేమిటి గుండ్రంగా! దాని షేపే కళ్ళకు మెత్తగా—

"ఆడదాని రొమ్ము."

ఆహహ! "మాతృత్వంలోనే వుంది ఆడ జన్మ సార్థకమే"

ఓహోహో! ఎంత మిస్టికల్ అయిన ఆవేశం.

ఛీ! ఛీ! దాని రొమ్ముకు తొండలా పిల్లాడేమిటి?

దానికి లొట్ట కన్నేమిటి

దాని ముందు పరచిన చిరుగుల పట్టా ఏమిటి.

కన్నులేదు కాని ముండకు బిడ్డకావాలి.

దాని లొట్ట కన్ను చూసి, తొండ బిడ్డ చూసి, డబ్బులేయాలి.

దోపిడీ! దోపిడీ! చిన్న పైసల దోపిడీ,

అందమైన కలల దోపిడీ.

అన్యాయం! అధర్మం! దౌర్జన్యానికి ప్రపంచంలో తావేలేదు.

ఈ బస్సు కదలదేం.

జగన్నాథ రథం కదలదేం.

వస్తున్నా దొస్తున్నాడు! జగన్నాథ రథ సారథి వస్తున్నాడు. ప్రేమగుమ్మం ఛాదో స్తున్నాడు.
ఆర్. టి. సి. స్ట్రైక్.

పీనుగు వెధవ అందరికీ యూనియన్లూ, స్ట్రైకులూ. వీళ్ళా జగన్నాథ రథం కదిలించేది. నేను కదిలించగలను. నా లాంటి సద్వంశ సంజాతులు.

ఘటనా ఘటన సమర్థులు.

కానీ నాకు లేదు స్వాతంత్ర్యం.

అందుకు ప్రయోగిస్తాను చాణక్య తంత్రం.

హా! మాకియవెల్లీ + టాల్స్టాన్ డా॥ ఉమేష్,

ప్రపంచాధినేతనై కదిలిస్తాను జగన్నాథ రథాన్ని నా ఇష్టానుసారంగా.

హమ్మయ్యా! బస్సు కదిలింది!

పాతబస్సు. పాడు బస్సు.

నట్లు లూజై పోయాయి,

ఎక్కడికక్కడ విడిలిపోతే.

కొత్త బస్సొస్తుందే!

వస్తుందో రాదో,

లేదు రాదు రానేరాదు.

పాత బస్సు రేకులే బిగించి కొత్తరంగు వేస్తారు.

కొత్తనేది లేనేలేదు. 'క్రొత్త' అనేది మన భ్రమ.

అదే పదార్థం కొత్త ముసుగు.

ఎటర్నల్ రికరెన్సు. మా బాగా చెప్పాడు నెయిట్జ్షి.

క్రీక్ క్రీక్. బకుక్. బకుక్.

గోతులు. పాతబస్సు.

నా కింద అగాథమైన గోతులు.

బస్సు విచ్చిపోతుంది. తప్పక విచ్చిపో తుంది.

భయం. భయం. పాడు భయం.

అమ్మో! నాయనో!

హా! అమ్మ! నాయన

అమ్మ తిరుగుబోతు.

నాన్న తాగుబోతు.

నా ఆస్తి కరగించేశారు.

నా ఆస్తిని తాగేశారు.

లేకపోతే యం. పి. నయ్యేవాణ్ణి.

విప్ (వి. ఐ. పి.) నయ్యేవాణ్ణి.

ప్రశ్నించినవాడికి చళ్ చళ్ కొరడాదెబ్బ.

తిరగబడిన వాడికి ఢన్ ఢన్ తుపాకి గుండు.

మా తాతగారు మంచివాడు.

మా ముత్తాతగారు గొప్పవాడు.

ముత్తాత ముత్తాతగారి ముత్తాతగారి ముత్తాతగారు

శివాజీ సామంతుడు.

వెంటనే వారి వద్దకెళ్ళిపోవాలి.

మొనార్క్నై నెపోలియన్నై ప్రపంచా న్నొక్క వూపు వూపాలి.

డ్రైవర్ వెంటనే బస్సు వెనక్కి తిప్పు.

వెనక్కిపోనీ శరవేగంతో.

వెనక్కి తిప్పితే, వెనకబడిన వాళ్ళు చస్తారంటావా!

చావనీ, నాకేం!

రూల్సొప్పవంటావా! ఘూల్సు చేసింది మేమే కదయ్యా!

తిప్పు వెనక్కి

నీకు మేడలిస్తా, ముండలిస్తా, సినిమా చూపిస్తా. సారా పోయిస్తా.

ఒరే డ్రైవరూ ఇది ధర్మం కాదురా! నరకానికి పోతావురా

వెనక్కి తిప్పటం దేశభక్తి. వెనక్కి తిప్పడం హిందూధర్మం.

శపిస్తా శపిస్తా తిప్పు వెనక్కి.

పోలీసుల పిలిపిస్తా! సైన్యాన్ని కవాతు చేయిస్తా!

తిప్పు వెనక్కి.

ఇంకా ఇంకా వెనక్కి. వెనక్కి వెనక్కి వెనక్కి కిక్కి కిక్కి కిక్కి. ★

